ఎంపిక పూర్తయ్యేనా?



వాడ్యాల్‌లో ఇందిరమ్మ ఇంటి కోసం ఎదురు చూస్తున్న బాలయ్య

- ఇందిరమ్మ ఇళ్ల కోసం నిరుపేదల ఎదురుచూపులు
- పూర్తికాని లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ
- ఇళ్ల కోసం వేలల్లో దరఖాస్తులు

మిడ్జిల్: మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూపులు తప్పడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం దసరా కానుకగా ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వాలని సంకల్పించింది. ఎన్నో ఏళ్లుగా ఉన్న సొంతింటి కల నెరవేరబోతుందని నిరుపేదలు సంబరపడిపోయారు. మండలంలో దోనూర్‌లో పైలెట్ ప్రాజెక్టు కింద 52 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు, ఈ ఇళ్ల నిర్మాణానికి గతనెలలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రారంభించారు. ఇళ్లకోసం వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ఇంకా మిగిలిన గ్రామాల్లో లబ్దిదారుల ఎంపిక పూర్తి కాలేకపోవడంతో నిరుపేదలు నిత్యం నాయకుల, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

మొదటి విడతలో 2124 మంది గుర్తింపు

మండలంలో మొత్తం అధికారులు సర్వే నిర్వహించి, పూర్తిగా ఇళ్లు లేని వాళ్లను మొదటి విడతలో 2124 మందిని గుర్తించారు. మొత్తం ఇళ్ల కోసం 5667 మంది అర్హత ఉన్నట్లు ఫొటోలు తీసీ అప్‌లోడ్ చేశారు. అయ్యవారిపల్లిలో 68 మంది, బైరంపల్లిలో 90 మంది, బోయిన్‌పల్లిలో 84, చిల్వేర్‌లో 178, చౌటకుంటతండాలో 55, దోనూర్‌లో 150, ఈదుల బావితండాలో 53, కంచన్‌పల్లిలో 181, కొత్తపల్లి 68, కొత్తూర్‌లో 118, లింబ్యా తండాలో 59, మల్లాపూర్‌లో 21, మసిగోండ్లపల్లిలో 64, మంగళిగడ్డతండాలో 72, మిడ్జిల్లో 139, మున్ననూర్‌లో 8, పెద్దగుంటతండాలో 48, రాణిపేట్‌లో 75, సింగందొడ్డిలో 14. వల్లభ్‌రావుపల్లిలో 135, వస్పుల 64, వెలుగోమ్ముల 124, వేముల 137, వాడ్యాల్‌లో 119 మంది, మొత్తం 2124 మంది మొదటి విడతలో అర్హులని గుర్తించారు. కానీ నేటివరకు దోనూర్ మినహా ఇతర గ్రామాల్లో లబ్దిదారుల ఎంపిక త్వరగా పూర్తిచేస్తే ఇళ్లు నిర్మించుకుంటామని అధికారులు, నాయకులను ప్రజలు వేడుకుంటున్నారు.

ఇళ్లు త్వరగా మంజూరు చేయాలి



ప్రభుత్వం ఇచ్చే ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎన్నో రోజుల నుంచి ఎదురు చూస్తున్నాం. చాలా రోజుల నుంచి గుడిసెలో నివసిస్తున్నాం. ప్రభుత్వం స్పందించి త్వరగా పేదలకు ఇళ్లు మంజూరు చేయాలి.

– బుచ్చమ్మ, వాడ్యాల్

సొంత డబ్బులతో ఇళ్లు నిర్మించలేం



మాలాంటి నిరుపేదలు సొంత డబ్బులతో ఇళ్లు నిర్మించలేరు. ప్రభుత్వం ఇచ్చే ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తే సొంతింటి కల నెరవేరుతుంది.

– సబేరా బేగం, మిడ్జిల్

ఇందిరమ్మ కమిటీల ఆమోదంతో..



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కోసం నియమించిన ఇందిరమ్మ కమిటీలు మండలంలో ఇప్పటి వరకు ఐదారు గ్రామాల్లో మాత్రమే లిస్టు వచ్చాయి. మిగతావి రాగానే వాటిని కూడా జిల్లా అధికారులకు పంపించి అర్హత ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం.

–గీతాంజలి, ఎంపీడీఓ, మిడ్జిల్

క్లుప్తంగా

పోలీసుల దాడి హేయమైన చర్య



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: హెచ్‌సీయూ భూముల వ్యవహారంలో పోలీసులు విద్యార్థులపై దాడులు చేయడం హేయమైన చర్య అని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈమేరకు పీయూలో ప్రభుత్వం హెచ్‌సీయూ భూములను వేలం వేయడాన్ని నిరసిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ, బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. బీఆర్‌ఎస్‌వీ నాయకుడు భరత్, ఎస్ఎఫ్ఐ నాయకులు రాము, ఆంజనేయులు, రామకృష్ణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల నిరసన



స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల రూల్స్‌ను సవరిస్తూ పార్లమెంట్‌లో ఆమోదించిన బిల్లును నిరసిస్తూ జిల్లా కేంద్రంలో గురువారం కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు టెలికాం, పోస్టాఫీసుల కార్యాలయాల ఎదుట నిరసన ధర్నా చేపట్టారు. పలువురు మాట్లాడుతూ ఈ పెన్షన్ రూల్స్ సవరణతో 40 ఏళ్ల పాటు దేశానికి సేవలు అందించిన కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల ప్రాథమిక హక్కు హరించినట్లేనని అన్నారు. సుధాకర్, రాజారత్నం, సి.కృష్ణయ్య, రంగయ్య, అనిల్‌కుమార్, లక్ష్మయ్య, రాంరెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షిద్దాం



అడ్డాకుల: సత్యం, అహింసా భావాలను పాటిస్తూ మహాత్మాగాంధీ, అంబేడ్కర్ ఆలోచనలను ఆచరించి రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు అందరం కలిసి కృషిచేద్దామని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాములు యాదవ్ అన్నారు. మండలంలోని కందూర్ గ్రామంలో గురువారం కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు జరిగిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ పాదయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తోట శ్రీహరి, నాగిరెడ్డి, నాగార్జున్‌రెడ్డి, కొండా జగదీశ్వర్, నరేందర్, దోమ రంజిత్ ఉన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా మిల్లిమహాజ్ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్లకార్డులతో నిరసన చేపట్టారు. పలువురు మాట్లాడుతూ రాజ్యాంగ ప్రమాణాలను రక్షించాల్సిన కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లింల మత స్వేచ్ఛను హరిస్తుందన్నారు. మిలీ మహాజ్ మహబూబ్‌నగర్ చీఫ్ ప్యాట్రన్ ఖాజఫయాజుద్దీన్ అన్వర్‌పాషా, కన్వీనర్ తఖీ హుస్సేన్ పాల్గొన్నారు.

భూముల వేలం సరికాదు

పాలమూరు: రాష్ట్రప్రభుత్వం హెచ్‌సీయూ భూముల వ్యవహారంపై ప్రవర్తిస్తున్న తీరును నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ చౌరస్తాలో నిరసన వ్యక్తంచేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ హెచ్‌సీయూ భూములపై ప్రభుత్వానికి కన్నుపడిందని, ఆ భూములను వేలం వేయడం సరికాదన్నారు. హెచ్‌సీయూ భూముల విక్రయాలను బీజేపీ నుంచి ఖచ్చితంగా అడ్డుకుంటామని తెలిపారు.

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

అడ్డాకుల: మండలంలోని కందూర్ గ్రామంలో గురువారం పాలమూరు యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల విద్యార్థుల ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ప్రారంభమైంది. ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రవీణ్, యూనిట్‌- 6 ప్రోగ్రాం అధికారి చిన్నాదేవి ఆధ్వర్యంలో విద్యార్థులు గ్రామానికి చేరుకున్నారు. గ్రామంలో తిరుగుతూ స్థానిక పరిస్థితులపై అవగాహన పెంచుకున్నారు. .

ఇసుక టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు

మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లిలో టీఎస్‌ఎండీసీ ద్వారా అనుమతుల పేరిట గురువారం మధ్యాహ్నం ఇసుక రవాణా ప్రారంభమైంది. కాగా ఈ ఇసుక టిప్పర్లను గ్రామస్తులు అడ్డుకున్నారు. అనుమతులున్న చోట కాకుండా ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 97లో ఇసుక తరలిస్తున్నారని, రైతులు తమ పొలాల నుంచి టిప్పర్లు పోవడంతో పంటలకు ఇబ్బంది కలుగుతుందని ఆరోపించారు.

నల్లగుంటలో సర్వే



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నం.75లో ఉన్న నల్లగుంట భూమిని గురువారం అధికారులు సర్వే నిర్వహించారు. హైకోర్టు ఆదేశాల మేరకు తహసీల్దార్ నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో ఇరిగేషన్, సర్వే అధికారులు సదరు సర్వే నంబర్‌లోని వివాదాస్పద భూమిని సర్వే జరిపారు. నల్లగుంటలో అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని, ఎఫ్‌టీఎల్ పరిధితోపాటు బఫర్‌జోన్‌లోనూ నిర్మాణాలు జరుగుతున్నాయని కొంతకాలంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇదే నేపథ్యంలో భూయజమానులు కోర్టును ఆశ్రయించగా ఇరిగేషన్ అధికారులు సైతం వాదోపవాదాలు వినిపించారు. దీంతో చేసిన నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని భూ యజమానులకు కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. దాంతోపాటు సర్వే నిర్వహించాలని సైతం కోర్టు ఆదేశాలు ఇచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు గురువారం సర్వే చేశారు. సర్వే నివేదికను కలెక్టర్‌కు నివేదిస్తామని తహసీల్దార్ స్పష్టం చేశారు.

ఐఎన్‌టీఎస్‌ఓ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): శ్రీ చైతన్య పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఐఎన్‌టీఎస్‌ఓ లెవల్‌-2 విభాగం పరీక్షల్లో ఆ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ శ్రీధర్ మాట్లాడుతూ ఈ పరీక్షకు జాతీయ స్థాయిలో పాఠశాలల్లో 180 మంది విద్యార్థులు పరీక్ష రాయగా ఇందులో 160 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక తక్షశిల ఉన్నత పాఠశాలకు చెందిన 220 మంది విద్యార్థులు ఇటీవల జరిగిన ఐఎన్‌టీఎస్‌ఓ-2 పరీక్షలకు అర్హత సాధించినట్లు హెచ్‌ఎం మనోహర్ తెలిపారు. విజేతలను పాఠశాలలో అభినందించారు.

ఛత్రపతి శివాజీకి ఘన నివాళి

చిన్నచింతకుంట: కొకుంట్ల మండలం అప్పంపల్లిలో గురువారం ఛత్రపతి శివాజీ వర్ధంతిని పురస్కరించుకొని ఛత్రపతి శివాజీ సంఘం, గ్రామస్తుల ఆధ్వర్యంలో శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివాజీ సంఘం నాయకులు గురురెడ్డి, పెండెం అంజన్న మాట్లాడారు. శివాజీ మహరాజ్ అడుగుజాడల్లో యువత నడిచి ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. నాయకులు పెండెం శివన్న, కురుసలి రాజు, రామాంజగౌడ్, చెన్న కృష్ణయ్య, శివన్న, బాబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అజిలాపూర్‌లో అభియాన్ యాత్ర

దేవరకద్ర: మండలంలోని అడవి అజిలాపూర్ గ్రామంలో గురువారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా అభియాన్ యాత్ర నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్(బాలానగర్): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం బాలానగర్ మండలంలోని హేమాజీపూర్ నుంచి జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ నిర్వహించిన యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి 12 సబ్‌స్టేషన్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. హేమాజీపూర్ గ్రామాభివృద్ధికి రూ.45 లక్షలు నిధులు మంజూరు చేశామన్నారు. అనంతరం లింగారం, గాంధీపాలెం, నేలబండతండా వరకు యాత్ర కొనసాగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మురళీధర్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, తిరుపతి, రాజేశ్వర్‌రెడ్డి, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

వ్యక్తిపై కేసు నమోదు

పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బాలానగర్ పోలీసులు తెలిపారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి హేమాజీపూర్‌లో నిర్వహించిన పాదయాత్రలో కోయిల్‌కుంటతండాకు చెందిన లక్ష్మణ్‌నాయక్ తమ తండాకు రోడ్డు వేయాలంటూ ఎమ్మెల్యే వాహనాన్ని అడ్డుకోబోయాడు. ఎస్ఐ లెనిన్‌గౌడ్ సమస్య ఉంటే ఎమ్మెల్యేకు విన్నవించుకోవాలని, ఇలా రోడ్డుకు అడ్డంగా ఉండి ఇబ్బందులు కలుగజేయవద్దని లక్ష్మణ్‌నాయక్‌ను సూచించారు. అయినా వినకుండా ఎమ్మెల్యేపై దాడికి యత్నించగా పోలీసులు పక్కకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా వారితో దురుసుగా ప్రవర్తించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు క్రాసింగ్ మూసివేత

అడ్డాకుల: మండల కేంద్రంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న రోడ్డు క్రాసింగ్‌ను రహదారి నిర్వాహకులు గురువారం మూసివేశారు. ఇక్కడ వాహనాలు రోడ్డు క్రాస్ చేసే సమయంలో ఇటీవల ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. బ్లాక్ స్పాట్‌గా గుర్తించిన రహదారి నిర్వాహకులు వేగ నిరోధకాలను ఏర్పాటు చేసి రోడ్డు క్రాసింగ్‌ను పూర్తిగా మూసివేశారు. వ్యవసాయ కార్యాలయం వైపు నుంచి వచ్చే వాహనాలు కొత్తకోట వైపు వెళ్లే క్రమంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అదేవిధంగా క్రషర్ వైపు నుంచి రాంగ్‌రూట్లో వచ్చే వాహనాలు, బైక్‌లు ఇక్కడే రోడ్డు క్రాస్ చేస్తున్నాయి. అడ్డాకుల బస్టాండ్ వైపు నుంచి వచ్చే వాహనాలు బ్రిడ్జిలోంచి పోలీస్‌స్టేషన్ మీదుగా కొత్తకోట వైపు వెళ్లే అవకాశం ఉన్నా ఇక్కడ క్రాసింగ్ ఉండటంతో రాంగ్‌రూట్లో వచ్చి రోడ్డు క్రాస్ చేసేవారు. దీంతో పాటు బ్రిడ్జి మీదుగా వచ్చే వాహనాలు వేగంగా వస్తూ అడ్డాకుల వైపు ఇక్కడే రోడ్డు క్రాస్ చేస్తుండటం కూడా ప్రమాదాలకు కారణంగా మారుతుండటంతో రోడ్డు క్రాసింగ్‌ను మూసివేశారు.



రోడ్డు క్రాసింగ్‌ను మూసి వేస్తున్న అధికారులు

రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ



మూసాపేట మండలం పోల్కంపల్లిలో సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్న నాయకులు



మనికొండలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్‌లు గంగన్న, ఆంజనేయులు

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లి గ్రామంలో గురువారం రేషన్ షాపులో సన్న బియ్యం పంపిణీని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్ ప్రారంభించారు. సింగిల్‌విండో ద్వారా నిర్వహిస్తున్న రేషన్ షాపులో నిరుపేదలకు సన్న బియాన్ని పంపిణీ చేశారు. అడ్డాకుల మండలం శాఖాపూర్‌లోనూ సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ నిరంజన్, సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, సీఈఓ భాస్కర్‌గౌడ్, యాదయ్య, రాంచందర్, సురేష్ ఉన్నారు.

అప్పంపల్లిలో..

చిన్నచింతకుంట: కొకుంట్ల మండలం అప్పంపల్లిలో సన్నబియం పంపిణీ కార్యక్రమాన్ని సింగిల్‌విండో డైరెక్టర్ నెల్లి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షుడు బోయ నర్సింహులు గురువారం ప్రారంభించారు. డీలర్ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు శాంతిరెడ్డి, జంజన్న, ఎల్‌రాఘవేందర్‌రెడ్డి, పి.రాఘవరెడ్డి, పి.నాగిరెడ్డి, కుర్వశ్రీను, యాదిరెడ్డి ఉన్నారు.

మనికొండలో..

మహబూబ్‌నగర్ రూరల్: ప్రభుత్వం ఉచితంగా అందిస్తునన సన్న బియ్యంను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు, మాజీ సర్పంచ్‌లు బొంగు గంగన్న, గంజి నర్సిములు, ఎం.ఆంజనేయులు అన్నారు. మండలంలోని మనికొండలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.మాజీ ఎంపీటీసీ సుధాసాగర్, మాజీ ఉపసర్పంచ్ చంద్రశేఖర్, మీసాల వీరేష్, బస్వరాజ్, యాదయ్య, గోవింద్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని పలు గ్రామాల్లో..

దేవరకద్ర: మండలంలోని గూరకొండ, చిన్నరాజమూర్, కోయిల్‌సాగర్, బల్సుపల్లి, బస్వాయపల్లి, వెంకటాయపల్లి, గద్దెగూడెం గ్రామాల్లోని రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. గూరకొండలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఉసేనప్ప, చిన్నరాజమూర్‌లో జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కోనరాజశేఖర్, ప్రేమ్‌కుమార్, గోపాల్, చంద్రమౌళి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పేదల సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

సాయుధ పోరాట తొలి అమరుడు కొమురయ్య

- కలెక్టర్ విజయేందిర బోయి
- కొమురయ్యకు ఘన నివాళి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. దొడ్డి కొమురయ్య జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన కొమురయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దొరల దురాగతాలను ఎదురించిన గొప్ప వీరుడు దొడ్డి కొమురయ్య అని అన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఇందిర, జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి, జిల్లా అధికారులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి, అధికారులు

వ్యవసాయ అధికారుల ఫోన్ నంబర్లు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): జిల్లా వ్యవసాయ అధికారుల సెల్ నంబర్లు మారాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.వెంకటేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదివరకు పనిచేసిన ఫోన్ నంబర్లు పని చేయవని, కొత్త నంబర్లను రైతులు సంప్రదించాలని పేర్కొన్నారు.

■ బి.వెంకటేష్ జిల్లా వ్యవసాయశాఖ అధికారి (ఎఫ్ఏసీ) 8977749229 ■ బి.మాధవి సహాయ సంచాలకులు (డీడీఏ(ఎఫ్‌టీసీ) మహబూబ్‌నగర్ 8977749240 ■ బి.వెంకటేష్ సహాయ సంచాలకులు, మహబూబ్‌నగర్ రూరల్ 8977749233 ■ పి.ఆంజనేయులుగౌడ్ సహాయ సంచాలకులు, (బీసీఎల్) ఓఎస్, మహబూబ్‌నగర్ 8977749217 ■ ఎంజే ఏవంగేలినే సహాయ సంచాలకులు (ఎస్‌టీఎల్) జడ్చర్ల 8977749216 ■ ఎ.ఆంజనేయులు సహాయ సంచాలకులు, జడ్చర్ల 8977749232 ■ ఎస్.యశ్వంత్‌రావు సహాయ సంచాలకులు, దేవరకద్ర 8977749231 ■ సి.బ్యూలా ఏఓ, అడ్డాకుల 8977750622 ■ జి.మురళీధర్ ఏఓ, భూత్పూర్ 8977750623 ■ ఎం.రాజేష్ కన్నా ఏఓ, చిన్నచింతకుంట 8977750624 ■ ఎన్.రాజేందర్ అగర్వాల్ ఏఓ, దేవరకద్ర 8977750625 ■ బి.అనిల్‌కుమార్ ఏఓ, మూసాపేట 8977750626 ■ బి.శివకుమార్ ఏఓ, కొకుంట్ల 8977750628 ■ ఎం.సుజాత ఏఓ, బాలానగర్ 8977750655 ■ బి.గోపినాథ్ ఏఓ, జడ్చర్ల 8977750656 ■ జి.సిద్ధార్థ ఏఓ, మిడ్జిల్ 8977750657 ■ వి.కృష్ణ కిషోర్ ఏఓ, నవాబుపేట 8977750658 ■ కె.ప్రదీప్‌కుమార్ ఏఓ, రాజాపూర్ 8977750659 ■ బి.రాంపాల్ ఏఓ, గండీడ్ 8977750714 ■ ఎ.కిరణ్‌కుమార్ ఏఓ, హన్వాడ 8977750715 ■ డి.యమరెడ్డి ఏఓ, కోయిలకొండ 8977750716 ■ పి.శ్రీనివాసులు ఏఓ, మహబూబ్‌నగర్ అర్బన్ 8977750717 ■ కె.శృతి ఏఓ, మహబూబ్‌నగర్ రూరల్ 8977750719 ■ జె.నరేందర్ ఏఓ, మహ్మదాబాద్ 8977750720.

యూపీఎస్‌ను రద్దు చేసేదాకా పోరాటం

- సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్
- నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): యూపీఎస్‌ను పూర్తిగా రద్దు చేసేదాకా పోరాటం చేస్తామని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్ అన్నారు. యూపీఎస్ అమలును నిరసిస్తూ పట్టణంలోని బీపీహెచ్‌ఎస్ స్కూల్, పోలీస్ లైన్ స్కూల్‌లో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చంద్రకాంత్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం 2025 ఏప్రిల్ 1నుంచి తీసుకువచ్చిన యూనిఫైడ్ పెన్షన్ స్కీంతో ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం నవాబుపేట మండలాధ్యక్షుడు పాశం గోపాల్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, మురళీకృష్ణ, శ్రీకాంత్, శంకర్, శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోలీస్‌లైన్ స్కూల్ ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న సీపీఎస్ ఉద్యోగులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

చిన్నచింతకుంట: నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండపేట ఆంజనేయ స్వామి ఆలయం వద్ద మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని భారత మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు భార్గవి డిమాండ్ చేశారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. దేశంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. ఊర్కొండపేట ఘటనను భారత మహిళా సమాఖ్య తీవ్రంగా ఖండిస్తుందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మెట్టుగడ్డచౌరస్తాలో నిరసన

మహబూబ్‌నగర్ రూరల్: ఊర్కొండపేట ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలంటూ ఎమ్మార్పీఎస్(ఆర్ఆర్), బేడ బుడగ జంగం, కమ్మరి సంఘం, లంబాడ హక్కుల పోరాట సమితి, విశ్వబ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో గురువారం స్థానిక మెట్టుగడ్డ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ (ఆర్ఆర్) జిల్లా ఇన్‌చార్జి రాజగాని అశోక్ మాట్లాడుతూ బాధితురాలికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు ఆర్థిక సహాయం చేసి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు యాదగిరి, ఆంజనేయులు, రాజు, సూర్య పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధి కృషి



నవాబుపేట: పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని మార్కెట్ చైర్మన్ లింగం అన్నారు. గురువారం మండలంలోని కొల్లూర్‌లో మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత పశు వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాలకు పూర్వ వైభవం వచ్చేలా పశు సంపదను పెంచాలన్నారు. ఈశిబిరంలో 317 పశువులకు టీకాలు, మందులు అందించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ తులసీరాంనాయక్, వాసుయాదవ్, రాంచంద్రయ్య, ఖాజా, ప్రభాకర్, పద్మమ్మ, కృష్ణయ్య, నర్సింహ, రవి, రమేష్ ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మిడ్జిల్: మండలంలోని మున్ననూర్ సమీపంలోని దుందుభీ వాగు నుంచి గురువారం అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవాబుపేట: కొల్లూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్లలో శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సంతోష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి వాడకం దృష్టిలో ఉంచుకొని కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అందుకు జరిగే అంతరాయానికి అందరూ సహకరించాలని సూచించారు. మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు చౌడూర్, దేపల్లి ఆగిర్యాల్ ఫీడర్లు 3 ఫేస్ అందుబాటులో ఉంటుందని వివరించారు.

గౌరవ వేతనం ఇవ్వాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: గతంలో ప్రభుత్వం నిర్వహించిన కుటుంబ సర్వే కోసం విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు గౌరవవేతనం ఇవ్వాలని కోరుతూ తపస్ సంఘం ఆధ్వర్యంలో నాయకులు గురువారం కలెక్టర్ విజయేందిర బోయికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ వీలైనంత త్వరగా గౌరవ వేతనం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

హన్వాడ: ఈనెల 5వ తేదీన నారాయణపేటలో నిర్వహించే గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 2వ మహాసభలను విజయవంతం చేయాలని ఆసంఘం నాయకులు పిలుపునిచ్చారు. గురువారం మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. నాయకులు బాలకిష్టయ్య, వెంకట్రాములు, రంగయ్య, రాములు, గంగాపురి పాల్గొన్నారు.